విషాదాంత ప్రణయగాథ

# "సప్తమంలో కుజుడు"

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"ఇంకా నాకేమీలేదు జీవితంలో!" అంటూ ఓ నిట్టూర్పు విడిచాడు గోపాలరావు... బరువుగా. చాలా పాథోస్‌కోసం ముఖంకూడా వేలేశాడు.

"ఏంభాయ్...ఏమిటి సంగతి?" అన్నాను నెమ్మదిగా, మావాడి వ్యవహారాలు బాగా తెలిసి ఉన్నవాడిని కనుక. అట్లా అడగకపోతే మరీ ఏడుస్తాడని.

"నీతో చెప్పినా, చెప్పకపోయినా ఒకటే" నన్నాడు గోపాలరావు, ఈసారి కొంచెం నీరసంగా.

"అయితే, చెప్పడమే మంచిది" అన్నాను.

"నేను చెప్పను."

వేరుశెనగకాయలు ఓ అణావి కొనుక్కుని ముందు పోసుకున్నాం. వాడు విచారభారంలో వాటిలో చాలాభాగం అప్పటికే కాజేసి ఉండడం వల్ల మళ్లా అవిఅమ్మే మనిషివొస్తే బాగుండును అనుకుని ఆలోచిస్తున్నాను.

"నేనెందుకింత విచారంగా ఉన్నానో ఆలోచిస్తున్నావుకాదూ?...నూరు జన్మలెత్తినా నీకది బోధపడదు" అన్నాడు మావాడు.

దీనికి జవాబు చెప్పకపోతే వాడు మరీ గొప్పవాడి పోజువేస్తాడని, తింటోన్నది పూర్తికానిచ్చి, "భాయ్! ఈ షేక్‌స్పియర్ ముఖం వేసేందుకు రెండేరెండు కారణాలు ఉంటాయి ఎవరికైనా, ఒకటోది కామిని; రెండోది కాంచనం" అన్నాను.

వాడు ఒక్కసారి గేస్‌లైటులాగ వెలిగి, "నీకు థాట్‌రీడింగ్‌కూడా వొచ్చేరా!" అన్నాడు.

నేను మాట్లాడకుండానా నా బిజినెస్ పూర్తి చేసుకుంటున్నాను.

"నిజం చెప్పాలంటే, నువ్వు సరిగ్గా గ్రహించేవు భాయ్!...అంతేకాదు, ఆ రెండువిషయాలూ కూడా నావిషయంలో ఒక్కసారి సాక్షాత్కరించి తల పాడుచేశాయి."

"అంటే......"

"డబ్బులేదు బ్రదర్...తుచ్ఛం—దానికేమిటి, కాని, రెండోది పూర్తిగానిజం."

"ఊఁ...అయితే, ప్రేమజబ్బేనన్నమాట!"

"నువ్వు కత్తీలేని రాక్షసుడివిరా!" అన్నాడు గోపాలరావు మరీ బాధపడిపోతూ. వాడికీ నాకూ ప్రేమవ్యవహారాలలో ఎప్పుడూ దెబ్బలాటే.

"థాంక్స్" అన్నాను.

వాడు ఎదురుగాఉన్న సముద్రంవంకచూస్తూ స్వయంగా నిశ్శబ్ద మహాసముద్రంలో పడిపోయాడు. వాడి ఏడుపంతా బయటికివొస్తే నేను తడిసిపోవాల్సివస్తుందని నాకు తెలుసు; అంచేత నేను మరీ సీరియస్‌గా నాపని సాగించాను.

అయినా వాడు వొదలలేదు. కొద్దినిముషాలు పోయాక, "నువ్వు పద్మనిని ఈమధ్య చూశావూ?" అన్నాడు.

"ఆఁ, మొన్న సరస్వతీలో చూశాను. రెండో ఆటకి వొచ్చింది వెంకటేశంతో"

"ఛా...ఆ అమ్మాయిని నువ్వూ అనుమానిస్తున్నావురా?" అన్నాడుపూర్తిపాథోస్‌తోగోపాలం.

"ఇందులో అనుమానానికేం లేదురా బ్రదర్! వెంకటేశంలేకుండా ఆ అమ్మాయిని కాలేజీ ఇవతలచూసిన మానవుడు లేడు. బీచిలోనూ, షికార్లలోనూ ఆవిడ చెయ్యిపట్టుకోకుండా అతను నడిచినది ఇప్పటికిలేదు. లోకులు చెప్పేదానిలో ఏమన్నా సత్యం ఉంటే అతనామెని ముద్దుపెట్టుకోని రోజుకూడా..."

"లోకులని పట్టినే కాకులన్నారా బ్రదర్? నువ్వూ ఇలాగేఅంటే..." వాడు ఏడుపుమొహం పెట్టేడు.

"అదికాదురా బ్రదర్..." అన్నాను ఓదార్చుతూ, ఏడ్చినా నాకు అభ్యంతరం ఏమీలేదు కాని, అప్పుడు వోదార్చడం మరీకష్టం.

"ఉన్నమాట చెప్పేస్తున్నాను." అన్నాడు గోపాలం ఈసారి. "నేను పద్మనిని ప్రేమించాను. చాలా ఉన్నతమైనదీ, పవిత్రమైనదీ, అచంచలమైనదీ నా ప్రేమ."

"కాస్తతగ్గు" అన్నాను ఆ ప్రేమ సముద్రంలో మునిగిపోతానేమోనని. వాడు ఊరుకున్నాక, "నీ ప్రేమగురించి నాకేమీ అనుమానంలేదు బ్రదర్—ఎప్పుడూ, ఏ ప్రేమ విషయంలోనూ నిన్ను నేను అనుమానించలేదు" అన్నాను.

"ఆ ప్రేమలు వేరు—" అన్నాడు గోపాలం. "ఇది మనస్సులోనించి—ఆత్మలోనించి."

"అవున్రా బాబూ ... అవును. పుస్తకాలలోనించి అనికూడా అను నిజంచెప్తావు. అది సరే గాని, ఆమెకూడా నిన్నింత 'ఉన్నతం' గానూ, 'పవిత్రం'గానూ మొదలైనట్లు ప్రేమించిందా?" అన్నాను.

"ఆఁ," అన్నాడు.

"ఉత్తరాలు రాస్తోందా?" అన్నాను.

"రాస్తోంది—కాని, ప్రణయ వ్యవహారాలు ఉత్తరాల్లో పెట్టేంత ఫూల్ కాదు పద్మ..."

"మరి ఎలా తెలిసింది? అన్నాను.

"ఆచూపులు...ఒరేయ్!...నువ్వు ఎక్కడైనా నాకన్న గొప్పవాడివని అంగీకరిస్తానుకాని ప్రేమ వ్యవహారాలలో మాత్రం నా శిష్యుడివే"నన్నాడు.

"అయితే, ఆ 'చూపు'లో ఉందంటావ్ ఆమె ప్రేమఅంతా" అన్నాను.

"వెర్రివాడా! ప్రేమ మాట్లాడుకోడానికి ఓభాషఉంది. అది నిశ్శబ్దంగా ఉంటుంది...ఒట్టి చూపులుగా మీకు కనిపించేవాటిలో తరతరాల నించి దాచుకుని జన్మజన్మాలనించి ఒలకబోద్దామనుకొంటూన్న ప్రేమ గడ్డకట్టి ఉంటుంది. నువ్వు వొట్టిబ్రూట్ వి. ఎప్పుడైనా సత్యమూ, శివమూ సుందరమూ అయిన ప్రేమలో పడిఉంటే తెలుస్తుంది" అన్నాడు.

వాడి చింపిరిజుత్తూ, (ఒకప్పుడు దాన్ని వాడు మహా జాగ్రత్తగా దువ్వేవాడు) బొత్తాలుపెట్టని షర్టూ, అన్నిటికన్నా వాడి ఏడుపుముఖమూ చూసి ప్రేమతత్త్వం అంటే ఇంతే కాబోలునని ఊరుకున్నాను.

కొన్ని నిమిషాలలా గడిచాయి. మావాడు ఎలక్ట్రిక్ షాక్ (గట్టిగా) తిన్నవాడిలా త్రుళ్లిపడి లేచాడు.

"అదిగో!" నన్నాడు.

పద్మా, వెంకటేశం మావంకే వొస్తున్నారు. మావాడి వైపు నేను చూశానుగాని, వాడిని వర్ణించేందుకు నాదగ్గర పదజాలంలేదు, మిగిలిన కథ కూడా చాలా భావోద్రేక పరిస్థితుల్లో జరిగింది. అందుచేత దాన్నికూడా క్లుప్తంగా మనవిచేస్తాను.

పద్మ మమ్మల్నిచూసి ఆగి, గోపాలాన్ని వెంకటేశానికి పరిచయంచేసింది. వెంకటేశం నన్నడిగాడు—గోపాలం మాట్లాడే స్థితిలోలేదు. నన్ను నేనే పరిచయం చేసుకున్నాను. ఇంతట్లో గోపాలానికి తెలివొచ్చి వెంకటేశంగాడిని చూశాడు.

పద్మ అతననీ పరిచయంచేసింది. "మా యజమాని" అన్నది.

వాళ్లు సెలవుతీసుకుని సాగిపోయారు. గోపాలం తెలివితెచ్చుకుని, "యజమాని అంటే ఏమిట్రా?" అన్నాడు.

"భర్త అనుకుంటాను. ఆ అమ్మాయి మెడలో మంగళసూత్రాలు నేను చూశాను" అన్నాను.

"నీముఖం—యజమాని అంటే..."

"డిక్షనరీచూడు, పద ఇంటికి" అన్నాను.

వాడు నడవలేకపోయాడు. వాడి చొక్కాకి జేబులులేవు. అయినా, నాపర్సు చూసుకుని రిక్షాని పిలిచాను.

---

ఆసుపత్రిలో రోగి (పక్కరోగితో:) మన నర్సుఉందే, నిజంగా దేవత! ఆమె చెయ్యి ఒక్కసారి నా చెంపకి తగిలేసరికి సగం జ్వరం తగ్గిపోయింది.

పక్కరోగి: అవును-నీ చెంపమీద ఆవిడ చెయ్యివేయడం యీ హాల్లో అందరికీ వినిపించింది!